మేఘాలయకు తొలి మహిళా డీజీపీ

ఈశాన్య భారతదేశంలోని ఏడుగురు అక్కచెల్లెళ్లుగా పిలిచే రాష్ట్రాల్లో మేఘాలయ ఒకటి. ఈ రాష్ట్రంలో గారో, ఖాసి, జైంతియా ప్రధాన గిరిజన తెగలు. ఇక్కడ మాతృస్వామ్య వారసత్వ వ్యవస్థ అమలులో ఉంది. వీరిలో ఖాసి తెగకు చెందిన ఇడషిష నాంగ్‌రంగ్‌ను ఆ రాష్ట్రానికి మొదటి మహిళా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా నియమిస్తూ ఆ రాష్ట్ర గవర్నర్ మే 12న ఉత్తర్వులు జారీచేశారు. ఆమె ఈ నెల 20న పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఖాసీ తెగ నుంచి ఒక రాష్ట్రానికి పోలీస్ బాస్‌గా నియమితులైన తొలి మహిళగా నాంగ్‌రంగ్ చరిత్ర సృష్టించారు. 1992 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి అయిన ఆమె ప్రస్తుతం మేఘాలయ రాష్ట్ర సివిల్ డిఫెన్స్ విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా, నాంగ్‌రంగ్ 2021లోనే తాత్కాలిక (యాక్టింగ్) డీజీపీగా పనిచేశారు కూడా. కాగా మేఘాలయ డీజీపీగా ఆమె 2026 మే 19 వరకు కొనసాగుతారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా... 'అడ్డుగోడలను బద్దలుకొట్టి చరిత్ర సృష్టించారని... ఇది తమకు గర్వకారణం' అంటూ ఆమెకు అభినందనలు తెలియజేశారు. స్థానిక ఖాసీ తెగకు చెందిన మహిళ కాబట్టి అక్కడి పరిస్థితులను బాగా అర్థం చేసుకుంటారని మేఘాలయకు చెందిన మూడు ప్రధాన రాజకీయ పక్షాలు కూడా నాంగ్‌రంగ్ ఎంపికను స్వాగతించడం విశేషం.

నారీశక్తి

తెలుగువాళ్లకు అవార్డ్ సినిమాలు తీయడం రాదని ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భాల్లో ఒక విమర్శ వినిపిస్తుంది. ఆడవాళ్లు సినిమా లాంటి క్రియేటివ్ ఫీల్డ్‌లో ఎదగడం కొంచెం కష్టం అనే మాటా వినిపిస్తుంది. ఇవి రెండూ తప్పుడు మాటలని ఆమె నిరూపించింది. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై 'గాంధీ తాత చెట్టు'కు అవార్డులు పండుతున్నాయ్. ఈ సినిమా కోసం అమ్మాయిలు ఎన్ని చేతులు వేశారో అంతకంటే ఎక్కువే అవార్డులు వచ్చాయంటున్నది సినిమా దర్శకురాలు పద్మావతి మల్లాది. అనూహ్యంగా సినీ రంగంలో అడుగుపెట్టి, ఒక్కోమెట్టూ ఎక్కుతూ అంతర్జాతీయ వేదికలెక్కిన ఆమె తన ప్రస్థానాన్ని జిందగీతో ఇలా పంచుకున్నారు..

కొన్ని కథలు.. ఆడవాళ్లు చెబితేనే బాగుంటాయ్

మా అమ్మ అకడమీషియన్. నాకూ టీచర్ కావాలని ఉండేది. ఎంబీయే పూర్తయ్యాక లైఫ్ స్కిల్స్ నేర్పే ఇన్‌స్టిట్యూట్ పెట్టాను. పాఠశాలలు, కాలేజీల్లో వర్క్‌షాప్స్ నిర్వహించి టైమ్ మేనేజ్‌మెంట్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్ నేర్పించేదాన్ని. రెండు సంవత్సరాలు అలా గడిచింది. ఓ రోజు నా స్నేహితుడు వంశీ ఓ షార్ట్ ఫిల్మ్ తీస్తున్నాడని తెలిసింది. ఆ కథ చదవమని పంపించాడు. అది చదివి కొన్ని మార్పులు చెప్పాను. చాలా బాగా చెప్పావని మెచ్చుకున్నాడు. తను డైరెక్టర్ రాధాకృష్ణ గారికి నన్ను పరిచయం చేశాడు. ఆయన 'జిల్' సినిమా స్క్రిప్ట్ ఇంగ్లిష్ ట్రాన్స్‌లేషన్ పని అప్పగించారు. 'ఏవైనా కథలు రాశావా?' అనడిగారు. అరేంజ్డ్ మ్యారేజెస్ గురించి రాసిన 'సమ్మతం' ఆయనకు పంపించాను. ఆ కథ చదివి డైరెక్టర్ చంద్రశేఖర్ ఏలేటి గారిని కలవమని పంపించారు. అలాగే కలిశాను. ఆయన నాతో చాలాసేపు మాట్లాడారు. 'ఏ కథలు ఇష్టం. ఎలాంటి సినిమాలు ఇష్టం. ఎందుకు ఇష్టం. దాంట్లో నచ్చిందేమిటి?' అని ప్రశ్నలు అడుగుతూపోయారు. చివరికి 'మనమంతా' సినిమాకు మాటలు రాయమన్నారు. అదే విషయం ఇంట్లో చెబితే అమ్మ ఆశ్చర్యపోయింది. 'ఈ ఒక్క సినిమాకి చేయి. పని చేస్తున్నప్పుడు సంతోషం ఉంటే ఇదే నీ ఫ్యూచర్ అనుకో. లేకపోతే వదిలెయ్ 'అని పెద్దనాన్న చెప్పారు.

లక్కీ ఛాన్స్

'మనమంతా' అయిపోయాక సినిమాల్లో చేయగలననే నమ్మకం వచ్చింది. అందులో నేను చేసింది పెద్దగా ఏమీలేదు. నేర్చుకున్నదే ఎక్కువ. నాకు చాలా ఐడియాలు వచ్చేవి. వాటిని స్క్రీన్‌ప్లేలోకి ఎలా తీసుకురావాలో చంద్రశేఖర్ ఏలేటి గారు నేర్పించారు. ఆ తర్వాత 'రాధేశ్యామ్' సినిమా కోసం రాధాకృష్ణ గారి దగ్గర చేరాను. ఓ రోజు.. మహానటి సావిత్రి గారి బయోపిక్ తీస్తున్నారనే వార్త చదివాను. చిన్నప్పటి నుంచి ఆమె సినిమాలు ఎన్నో చూశాను. సావిత్రి గారి మీద ఉన్న ఇష్టంతో 'మహానటి'కి పని చేయాలనిపించింది. వెంటనే డైరెక్టర్ నాగ్ అశ్విన్‌ని కలిశాను. ఆయన సావిత్రి గారి జీవితంలో మూడు విషయాలు చెప్పారు. స్క్రీన్ కోసం ఆ సీన్స్ రాయమన్నారు. రెండు రోజుల్లో ఇవ్వాలని షరతు పెట్టారు. సినిమా వేరు, నిజ జీవితం వేరు. నాకు తెలిసింది సినిమాల్లో సావిత్రి గారు మాత్రమే. ఆమె వీడియో ఇంటర్వ్యూలు పెద్దగా అందుబాటులో లేవు. సావిత్రి గారి గురించి పల్లవి అనే రచయిత రాసిన నవల చదివాక కొంత అవగాహన వచ్చింది. బయోపిక్ కోసం పని చేస్తున్నప్పుడు చరిత్రలో ఏం జరిగిందో తెలుసుకోవడంతోపాటు అది జరిగినప్పుడు వాళ్లు ఎలా ప్రవర్తించారో అర్థం చేసుకోవాలి. రెండు రోజుల్లో పంపిస్తానన్న స్క్రిప్ట్ పది రోజులకు పంపాను. పంపిన రెండు గంటల్లోనే నాగ్ అశ్విన్ కాల్ చేశారు. 'నేను ఎలా అనుకుంటున్నానో? అలా రాశావు! ఎవరినీ అనుకరించకుండా, కొత్తగా రాస్తున్నావు!' అన్నారు. అలా మేమిద్దరం సావిత్రి సినిమా స్క్రీన్‌ప్లే రాశాం. ఈ సినిమాతో నన్ను నేను నిరూపించుకున్నాను. 'మహానటి' సినిమా చాలా అవార్డులు గెలుచుకుంది! నాకు కాన్ఫిడెన్స్ వచ్చింది. ఇదే నా ఫ్యూచర్ అనుకున్నాను. 'మహానటి' ఎంత హిట్ అయినా అది రెగ్యులర్ మాస్ మూవీ కాదు. మంచి పేరొచ్చింది. కానీ, కమర్షియల్ సినిమాలకు అవకాశాలు రాలేదు.

ఆ సినిమాకు నాదే బాధ్యత

'మహానటి' అనుభవం తర్వాత అంత గొప్ప పని కంటే అలవోకగా అయ్యేవి చేయాలనుకున్నాను. డైరెక్టర్ సింధూ చూసి చూడగానే సినిమాకు మాటలు రాసే అవకాశం ఇచ్చింది. ఇలా ఓ డజనుకుపైగా రెగ్యులర్, కమర్షియల్ సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ చేశాను. వాటిలో కొన్ని విడుదలయ్యాయి. తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు 'అమ్ము' సినిమా తీయాలనుకున్నారు. దాని కథ చారుకేశ రాశారు. అమెజాన్ ప్రైమ్‌కి ఆ స్టోరీ నచ్చింది. కానీ, తెలుగులో ఈ తరహా సినిమాలు రాలేదు. దీనిని తెలుగులో తీయమని షరతు పెట్టారు. అప్పుడు కార్తీక్ నన్ను సంప్రదించారు. 'అమ్ము'కు ఒక రచయిత్రితోనే మాటలు రాయించాలని చెప్పారు. సరే అన్నాను. సినిమాల్లో కథ, మాటలు రాయడానికి మహిళల అవసరం ఉంది. ఒక కథలో మహిళ పాత్రను మగవాళ్లు రాసిన దానికంటే మహిళ రాస్తేనే అర్థవంతంగా ఉంటుంది. పాత్రకు ఘటనలే కాదు అనుభవాలూ ముఖ్యం. అందుకే స్త్రీ పాత్రకు స్త్రీలే న్యాయం చేయగలరు. కానీ, మన సినిమాల్లో గుప్పెడు మంది కూడా రచయిత్రులు లేరు. 'అమ్ము' సినిమా యూనిట్‌లో ఎవరికీ తెలుగు రాదు. ఇంతకుముందు చేసిన సినిమాల్లో స్క్రిప్ట్‌లో ఏదైనా తప్పు ఉంటే డైరెక్టర్ మీదికి తోసేయొచ్చు. కానీ, ఈ సినిమాకు ఏది రాసినా నాదే బాధ్యత. చాలా సినిమాలకు చేశాను. కానీ, 'అమ్ము' డైలాగ్స్ నాకు చాలా ఇష్టం.

రైటర్ కమ్ డైరెక్టర్

'గాంధీ తాత చెట్టు' కథ ఆలోచన వచ్చినప్పటి నుంచి నేనే డైరెక్ట్ చేయాలనిపించింది. ఎవరికీ ఇవ్వాలనిపించలేదు. పదికిపైగా ప్రొడక్షన్ హౌస్‌లను సంప్రదించాను. కథ బాగుందన్నారు. కానీ, 'ఈ సినిమా మనం చేయలేమమ్మా' అన్నారు. కారణం ఇది అమ్మాయి మెయిన్ రోల్, అందునా పదమూడేండ్ల ఆడపిల్ల. అందుకే వద్దనుకున్నారని అనుకుంటా. ఎలాగైనా ఈ సినిమా చేయాలని సింధుతో అంటే తనే ప్రొడ్యూస్ చేస్తానంది. 'నీ దగ్గర అన్ని డబ్బులున్నాయా?' అంటే 'లేవు. కానీ ఏదో ఒకటి చేద్దాం' అంది. సినిమాస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో స్టోరీని లిస్టింగ్ చేశాం. ఆడిషన్స్‌లో ప్రధాన పాత్రకు సరైన అమ్మాయి దొరకట్లేదు. ఒక సినిమా ప్రివ్యూకి వెళ్తే డైరెక్టర్ సుకుమార్ గారు తారసపడ్డారు. ఆయనతో పాటు వాళ్లమ్మాయి సుకృతి కూడా వచ్చింది. సింధూకి తను నచ్చింది. 'నాకు పాడటం ఇష్టం. నటిని కావాలన్న కోరిక లేనప్పుడు నేనెందుకు నటించాలి?' అని సుకృతి అన్నది.

కానీ, ఆమెను కన్విన్స్ చేసి, రెండు వారాలు వర్క్‌షాప్ పెట్టాం. తాను సరిపోతుందని, చేయగలదని నమ్మకం వచ్చింది. ఈలోగా మాకు వందశాతం ఫండింగ్ వచ్చింది. 'గాంధీ తాత చెట్టు' పట్టాలెక్కింది. ఒక అమ్మాయి తాత గాంధేయవాది. గాంధీ చరిత్రను కథలుగా చెప్తుంటాడు. వాళ్ల ఊళ్లో ఒక సమస్య వచ్చింది. తాత దగ్గర నేర్చుకున్న జ్ఞానంతో ఆ అమ్మాయి ఆ సమస్యను ఎలా పరిష్కరించిందన్నదే ఈ సినిమా కథ. 'మహానటి'తో మంచి పేరు, 'గాంధీ తాత చెట్టు'తో అవార్డులు సాధించాను. నాకు సింగీతం శ్రీనివాసరావు గారంటే ఎంతో అభిమానం. ఇకముందు ఆయనలా ప్రయోగాత్మక చిత్రాలు తీసి, కమర్షియల్‌గానూ విజయాలు సాధించాలని అనుకుంటున్నాను.

అవార్డుల పంట

'గాంధీ తాత చెట్టు' సినిమా 20 ఫిల్మ్ ఫెస్టివల్స్‌కి ఎంపికైంది. జైపూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, నోయిడా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, దుబాయ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్, ఇండియన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఎనిమిది అవార్డులు వచ్చాయి. బెస్ట్ ఫిల్మ్‌తోపాటు బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా సుకృతికీ అవార్డు వచ్చింది. మొన్నటి దాకా ఈ సినిమా ఒకటుందని ఎవరికీ తెలియదు. దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డులు వచ్చిన తర్వాత అందరికీ తెలిసింది. ఫిమేల్ ఫిల్మ్ మేకర్స్‌కు సినిమా అవార్డు సాధించడం అందర్నీ ఆశ్చర్యపోయేలా చేసింది. నాకూ, సింధూకి ఇది మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమా జనాల్లోకి పోతే ఎలా ఉంటుందో చూడాలని ఆసక్తి ఉంది.

...నాగవర్ధన్ రాయల
సీఎం ప్రవీణ్

ఎగ్‌ప్లాంట్ పిజ్జా

కావలసిన పదార్థాలు

ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, **టమాట:** ఒకటి, **పిజ్జా సాస్:** అర కప్పు, **తురిమిన చీజ్:** అర కప్పు, **పార్సిమెన్:** పావు కప్పు, **ఆలివ్స్:** పావు కప్పు, **ఆలివ్ ఆయిల్:** అర కప్పు, **కొత్తిమీర తురుము:** కొద్దిగా.

తయారీ విధానం

ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఓవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం.

అమ్మ జంకకుండా.. జింక్ సూత్రం

మాతృత్వం మహిళలకు ఓ వరం. గర్భిణులు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కడుపులో ఉన్న శిశువు గురించి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. గర్భస్థ శిశువు ఎదగడానికి అవసరమయ్యే సమతుల ఆహారం తినాలని నిపుణుల సూచన. గర్భధారణ సమయంలో స్త్రీల శరీరానికి జింక్ ఎంతో అవసరం. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. తల్లి, శిశువు ఆరోగ్యానికి జింక్ దోహదం చేస్తుంది. శిశువు మెదడు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది. జింక్ సంపూర్ణంగా లభించే ఆహారపదార్థాలు ఏవో తెలుసుకుందాం..

చిక్కుళ్లు జింక్ మూలకానికి ఘనమైన మూలాలు. వేరుశనగ, కాయధాన్యాలు, బీన్స్ మొదలైన వాటిలో గర్భిణులకు రోజుకు సరిపడా జింక్ లభిస్తుంది. కాబట్టి వీటిని డైలీ డైట్‌లో చేర్చుకోవడం అవసరం. ఇవి రోగనిరోధక శక్తి పెంచడానికీ సాయపడతాయి.

బాదం, జీడిపప్పు జింక్ మూలకానికి ఖజానాల్లాంటివి. నానబెట్టిన బాదం, కాజు తినడం వల్ల శరీరానికి సరిపడా జింక్ అందుతుంది. ఫలితంగా బిడ్డ ఎదుగుదల సక్రమంగా సాగుతుంది.

గర్భిణులు రోజుకు ఒక గుడ్డయినా తీసుకోవాలి. ఇందులో విటమిన్ ఎ, బి, సి, డి, ఇ ఉంటాయి. కావాల్సినంత కాల్షియం ఉంటుంది. శరీరానికి అవసరమయ్యే సోడియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ కూడా పుష్కలంగా ఉంటాయి. ఒక గుడ్డులో 5 శాతం జింక్ ఉంటుంది. ఇది తల్లి ఆరోగ్యానికి రక్షణనిస్తుంది.

పొద్దుతిరుగుడు విత్తనాలు గర్భిణులకు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇవి తల్లీబిడ్డల ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

చికెన్‌లో జింక్ పుష్కలంగా ఉంటుంది. చికెన్ సూప్, గ్రిల్డ్ చికెన్ తినడం వల్ల శరీరానికి తగినంత జింక్ అందుతుంది. శాకాహారులు చికెన్‌కి బదులుగా సోయా, పుట్టగొడుగులను ఆహారంలో భాగం చేసుకోవాలి.

ఆలుగడ్డ ద్వారా జింక్ లభిస్తుంది. క్యారెట్, బీట్‌రూట్‌తో పాటు ఆలూ, చిలుగడదుంపల్ని కూడా తరచుగా తినాలి. ఈ ఆహార పదార్థాలను రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల పండంటి బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఉంటుంది.

నేచర్‌గ్రీన్ కురులు మీవే..

బరువు తగ్గడానికో మార్గం గ్రీన్ టీ. పని ఒత్తిడిని చిత్తు చేసే అస్త్రం గ్రీన్ టీ. ఇంటింటా మసలుతున్న గ్రీన్ టీ ఇప్పుడు సాటిలేని సౌందర్యానికి మేటి ఎంపికగా నిలుస్తున్నది. కురుల పటుత్వానికి గ్రీన్ టీ టిప్స్ ఫాలో అవుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. ఎవర్‌గ్రీన్ కేశ సౌందర్యానికి మీరూ ఈ టిప్స్ ఫాలో అవ్వండి.

- ఒక స్పూన్ గ్రీన్ టీ పొడిలో గుడ్డులోని పచ్చసొన, అర టీస్పూన్ ఆవపిండి కలిపి జుట్టుకు రాసుకోవాలి. 15-20 నిమిషాల తర్వాత ఏదైనా షాంపూతో తలస్నానం చేయాలి. వారానికి రెండు లేదా మూడుసార్లు ఈవిధంగా చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.
- రెండు కప్పుల నీటిలో ఒక టీ స్పూన్ గ్రీన్ టీ పొడి వేసి బాగా మరిగించాలి. తలస్నానం చేసిన తర్వాత ఈ నీటిని కుదుళ్లకు పట్టించి మసాజ్ చేసి అరగంట తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా తరచుగా చెయ్యడం వల్ల కుదుళ్లకు మంచి పోషణ అందుతుంది. దీంతో జుట్టు దృఢంగా మారుతుంది.
- అర కప్పు కొబ్బరినూనెలో ఒక స్పూన్ గ్రీన్ టీ పొడి వేసి బాగా కలిపి తలకు పట్టించాలి. అరగంట సమయం తర్వాత షాంపూ అప్లయ్ చేసి గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు క్రమం తప్పకుండా చేస్తే జుట్టు ఆరోగ్యంగా మారుతుంది.



అదే చివరి సినిమా అనుకున్నా!

టాలీవుడ్‌లో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, మహేష్‌బాబు సరసన హీరోయిన్‌గా నటించింది సోనాలి బింద్రే. బాలీవుడ్‌లోనూ స్టార్ హీరోయిన్‌గా వెలుగొందింది. క్యాన్సర్ బారినపడి కొన్నాళ్లు ఇండస్ట్రీకి దూరమైంది. ప్రస్తుతం 'ద బ్రోకెన్ న్యూస్2' సిరీస్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఎదురైన అనుభవాలను తాజాగా బయటపెట్టింది ఈ బ్యూటీ. 'నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో హీరోయిన్లు కాస్త బొద్దుగా ఉండేవారు. నిర్మాతలు అందరూ నన్ను కాస్త లావవ్వమని చెప్పేవారు. ఇలా ఉంటే అవకాశాలు దక్కవని భయపెట్టేవారు. సన్నగా ఉన్నానని హేళన చేసేవారు. నా నల్లటి జుట్టుపై కూడా విమర్శలు వచ్చేవి. అయినా, నేనెప్పుడూ కంగారుపడలేదు. నాకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు నడిచాను. డ్యాన్స్ రాకపోతే ఇండస్ట్రీలో మనుగడ ఉండదని చాలామంది అనుకుంటారు. సినిమాల్లోకి వచ్చేప్పటికి నాకు డ్యాన్స్ రాదు. ఆ కారణంగా డ్యాన్స్ మాస్టర్లు తిట్టేవారు. ఖాళీ సమయం దొరికితే డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేదాన్ని. క్లాసికల్ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన బొంబాయి సినిమాలో 'హమ్మ... హమ్మ' పాట చేసే అవకాశం దక్కింది. అప్పటి వరకు నేను చేసినవి కేవలం ఐదు సినిమాలు మాత్రమే. రాజు సుందరం మాస్టర్ కొరియోగ్రాఫర్. ఎలాగైనా ఆ పాటలో బాగా డ్యాన్స్ చేయాలని డిసైడ్ అయ్యాను. లేదంటే అదే చివరి సినిమా అనుకున్నా! 'హమ్మ.. హమ్మ' పాటతో ఊహించనంత గుర్తింపు వచ్చింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో మహిళా ప్రాధాన్యం ఉన్న కథలు వస్తున్నాయి. 'ద బ్రోకెన్ న్యూస్ 2'లో నా పాత్ర అందరికీ నచ్చుతుంది' అని చెప్పుకొచ్చింది సోనాలి బింద్రే.